

చెల్లుపెట్టిన బాకీ

"హితశ్రీ"

బాకీ దమ్మిడీమిగిలినా తనయింట్లో ప్రవేశించడానికి కోడలికిఅర్హతలేదనిఅత్తగారు అన్నది. ఎలా-?ఆరాత్రంతా జానకి ఆలోచించింది....

* * *

కట్నందబ్బు చెల్లించుకోలేని కారణాన తన జీవితసౌఖ్యాన్ని ఎవరి ఇంట్లో అనుభవించ వలసివుందో వారిచేత తిరస్కరింపబడి గోదావరీ నదికి తన మిగిలిన జీవితాన్ని అర్పించిన ఓ అదృష్టహీన విషాదాంతగాథ తెరపై చూసిన జానకి నేత్రాలు మర్నాడు ఎర్రబడడం సహజమే.

గతరాత్రి మనసోల్లాసం కోసం సినిమాకి వెళ్ళిన జానకి మనోవేదనతో తిరిగి వచ్చింది. చిత్రం కేవలం తన గత జీవితానికి ప్రతిబింబంలా ఉంది. ఆ రాత్రంతా జానకి ఆలోచించింది— చిత్రంలో పరాభూత అయిన మానవతి చేసిన ఆత్మార్పణ ఆమెను మాటిమాటికీ వేధించసాగింది. మరణించి సాధించగల ప్రయోజనం ఏమిటి? జాలిగుండె కలవారు సానుభూతి పూర్వకంగా నాలుగు అశ్రుకణాలు రాల్చవచ్చు. బడబానలంలా ఆ అశ్రుకణాలనుంచి అగ్నికణాలు ఆవిర్భవించి ఈ దురాచారాన్ని దహించగల అవకాశం లేకపోలేదు. కాని ఫలితం అందుకోటానికి తను లేకపోయిన తర్వాత ఏం జరిగితే ఏం ప్రయోజనం తనకి? విరక్తితో జీవిత విరమించడం కేవలం చేతకానితనం ఒప్పుకోవడమే. ఎవరిమీదో గల కోపమూ, కసీ తనమీదే చూపించుకొన్నందువల్ల కలిగేలాభం ఏముంది? తన దుఃఖానికి కారకులైనవారి మనసులు మార్చడం సాధ్యంకానిపక్షంలో వారికి తగిన పాఠం నేర్పడానికి ప్రయత్నించడం తన కర్తవ్యం. ఇందుకు, తన భవిష్యత్తును తమ పిడికిళ్లలో బంధించిన త్రిమూర్తులతో ఒకసారి ముఖాముఖి మాట్లాడడం ఎంతైనా అవసరం. కాని-కట్నంబాపతు

అనుకోకుండా బండి దిగిన కోడలినీ, ఆమె చిన్న తమ్ముణ్ణీ చూసి ఆశ్చర్యపోయారు, జానకి అత్తవారు. ప్రశ్నార్థకాల్లా ఉన్న వాళ్ల చూపులకి సమాధానం ఇచ్చింది జానకి—

'నాన్నగారు ముఖ్యమైన పని ఉండి రాలేకపోయారు ఈరోజు తప్పితే మళ్లీ నెలదాకా మంచిరోజు లేదట—' మధ్యలోనే ఆపివేసింది జానకి. ఈ మాటలకేమి. అసలు విషయం సంగతి ఏమిటన్నట్టు చూసింది జానకి అత్తగారు.

'అంతడబ్బు దగ్గర ఉంచడం మంచిది కాదని నాన్నగారు చెప్పి ఇచ్చారు.' తమ్ముడి దగ్గర నుంచి పర్సుతీసికొని చెప్పి మామగారికి అందించింది జానకి.

నాలుగు వేలు! పోయిందనుకున్న విలువైన వస్తువు దొరికిన వాడిలా ఆనందం పట్టలేక చిన్న కేకవేశాడు జానకి మామగారు. అత్తగారికి చాటంత ముఖం అయింది. లక్ష్మి, లక్ష్మిలాంటి కోడల్ని సంపాదించింది కదామరి! ఒక్కసారిగా ఆమెకు కోడలిమీద ఎక్కడలేని ప్రేమా, అభిమానమూ పుట్టుకొచ్చినయ్. కూతురుతో అంది:

'కమలా, మీ వదినెకి కాళ్లు కడుక్కోటానికి నీళ్లియ్యి—ఎప్పుడు నేర్చుకొంటావే, ప్రతీదీ చెప్పాలా?'

హడావిడిలో జానకి దరహాసం ఎవరూ గమనించలేదు.

ఆరాత్రి—

'ఇన్నాళ్ళకి నేను జ్ఞాపకం వచ్చానా-జానకీ?' అన్నాడు శ్రీధరరావు; తను మాట్లాడేది అర్థరహితం అని తెలిసి ఉండీ కూడా. జానకి మాట్లాడలేదు.

'ఇప్పటికైనా మనమీద దేవుడికి దయకలిగింది' అన్నాడు శ్రీధరరావు మళ్ళీ జానకీముఖం వంక చూస్తూ.

'పగ్గాలు మనచేతుల్లో పట్టుకుని బండి నడపడంలేదని ఎవర్నో దూషిస్తే ఏం లాభం?' కటువుగావచ్చిన ఈ సమాధానానికి శ్రీధరరావు కనుబొమ తెగరవేసి జానకివంక చూశాడు.

'అయిపోయిం దేదో అయిపోయింది కదా! నిజంగా ఇవ్వాళ ఎంత మంచిరోజు—'

'అవును. నాలుగువేలు వచ్చాయి కదూ.'

'అది కాదు, జానకీ...'

'మనసులో ఒకటీ, పైకి ఒకటీ ఎందుకు? నేనే మీకు కావలసి ఉంటే—'

'నువ్వు నన్ను సరిగా అర్థం చేసుకోలేదు జానకీ.'

'నిజం. అందుకే నేనీరోజు ఈ యింట అడుగుపెట్టటం సంభవించింది.'

'నీకు నామీద చాలా కోపంగా ఉంది. జరిగినదానికి నన్ను క్షమించలేవా?' శ్రీధరరావు జానకి చుబుకం ఎత్తి వేడికోలుగా అన్నాడు. జానకి అతనిచేతిని త్రోసివేసి అంది—

'జానకి కోపంతో మీకు నిమిత్తం ఏమిటి? మీకు కావలసింది డబ్బేకదా!' శ్రీధరరావు నవ్వాడు.

'కట్నం అడిగారనేనా నీ కోపం?'

'అడిగారని కాదు. కట్నంకోసం మూర్ఖపు పట్టు పట్టి అవతలి వ్యక్తి జీవితం నాశనం చెయ్యడానికికూడా జంకక అమానుషంగా ప్రవర్తించినందుకు.'

'మరి ఒప్పుకున్న కట్నం ఇవ్వ నక్కర్లేదా?'

'పరిస్థితులు తెలిసికూడా అలా మాట్లాడతారేమిటి? వివాహంనాటి ముందురోజే కదా దొంగలుపడి నాలుగువేలూ ఎత్తుకుపోయారు. మళ్ళీ అంతడబ్బూ ఇవ్వాలంటే మాటలు చెప్పడమా? పోనీ ఎగవేస్తామేమో అనే భయం ఉంటే నోటువ్రాసి ఇస్తామన్నారుగా! అదేమీ వీల్లేదు. నాలుగువేల రొక్కంతో వస్తేనే ఈ యింట్లో మీ అమ్మాయి అడుగు పెట్టవలసినదనే క్రూరులు మనుష్యులేనా?' ఉద్రేకంలో జానకి ముఖం ఎర్రబడ్డది.

'జానకీ!' కోపంగా అన్నాడు జానకి మామగారి అనుంగు కుమారుడు. 'పెద్దల్ని అలా దూషించడం నేను సహించను.'

'పెద్దలు మీవాళ్ళేనా, మావాళ్ళని దూషించినపుడు వాళ్లు చిన్నలా?' శ్రీధరరావు ముఖం వాడిపోయింది.

కోపంతో ఎర్రబారిన జానకి ముఖం ఆమె సహజసౌందర్యాన్ని మరింత ప్రస్ఫుటం చేస్తోంది. రక్తిమ చెంది వణకుతూన్న ఆమె పెదవులను చూసి శ్రీధరరావు సమ్మోహితుడయ్యాడు.

'జానకీ, ఈ రాత్రివేళ గడచినవన్నీ తవ్వుకోటం ఎందుకు? ఏదోవిధంగా సమాధానం కుదిరిపోయిందికదా—' ప్రేమపూరిత స్వరంతో అన్నాడు.

'లేదు. సమాధానం కుదరలేదు. జానకి మీకు కావాలని ఉంటే మీరు కట్నంమీద ఆశ వొదులుకోవాలి.'

'అదేమిటి, నాలుగువేలను చెక్కు తెచ్చావు కదా?'

'తెస్తేనేం, మళ్ళీ వాపసు చేయవచ్చు.'

'వాపసా, ఎందుకూ?'

'జానకి కట్నంతో రాదు.'

'ఏం?'

'ఆమెని మీరు డబ్బుకోసం పెండ్లి చేసుకోలేదు గనక. ఆత్మాభిమానం గల ఏ స్త్రీ తనకి డబ్బుకి లంకె వేయడం సహించదు. దక్షిణ ఇచ్చుకుని చేసే కాపరం లేకపోతేమాత్రం ఏం?'

'అయితే మరి ఎందుకు వచ్చావు?' విసుగ్గా అన్నాడు శ్రీధరరావు.

'మీ మనస్తత్వం ఎలాంటిదో గ్రహించటానికే. తలిదండ్రులకు తగిన కొడుకులని తెలుసుకోగలిగాను భగవంతుని దయవల్ల.' మిగిలిన రాత్రి ముళ్ళమీద ఉన్నట్టు గడిపింది జానకి.

మర్నాడుపొద్దున, 'బాబూ, బండి తీసుకురా' అన్న జానకి మాటలువిని ఆశ్చర్యపోయింది ఆమె అత్తగారు.

'అదేమిటమ్మాయీ, బండి ఎవరికి?'

'మాకేనండి.' ఈ మాటలువిని జానకి మామగారు చదువుతున్న పేపరునుంచి చూపు మర

లించి జానకివంక చూశాడు. శ్రీధరరావు తల వంచి చదువుతున్నట్లు నటిస్తున్నాడు.

'ఎందుకూ?' ఆశ్చర్యంగా అడిగింది అత్తగారు.

'కట్నం బాపతు బాకీ దమ్మిడీ మిగిలినా ఈ ఇంట్లో నడవడానికి మీ కోడలికి అర్హత లేదన్నారుగా!'

'సరే. ఇప్పుడా గొడవెందుకు? ఏదో మాటా మాటా వచ్చి అన్నామే అనుకో. అదేదీ ఒకిలిపోయింది కదా?' అన్నారు జానకి మామగారు.

'కట్నం బాకీ దమ్మిడీకూడా తీరలేదు, తీరదు' అన్నది జానకి దృఢంగా.

'ఏం!' దిగ్భ్రమచెందిన ఆమె అత్తమామలు ఒక్కసారిగా అన్నారు.

'ఆ చెక్కు మారదు.'

'ఎందుకు?' నాలుక తడి ఆరింది జానకి మామగారికి.

'డబ్బు లేదు.'

'ఆఁ. ఇంత మోసమా!' మండిపడ్డాడు నిరాశోపహతుడైన జానకి మామగారు.

'ఎంత అన్యాయం!' ఆమె అత్తగారు నోరు నొక్కుకుంది.

'మీరు చేసిన పనికంటె ఇది ఎక్కువ అన్యాయం కాదు. ధనాశావశులై కోటి మనుష్యుల జీవితాలను మొదలంటు నరకడానికి సిద్ధపడినవారికి ఎంత అన్యాయం జరిగినా అది న్యాయమే. ఎంతగా అంతరాత్మ క్షోభిస్తే నేనిలా మాట్లాడగలుగుతున్నానో గ్రహించండి.'

'సిగ్గు లేకపోతే సరి. చేసినపనికి సిగ్గుపడక తగుదునమ్మా అని వాదనకూడా ... ఛీ, ఛీ' అత్తగారు చీదరించుకుంది. జానకి ఆమెవంక ఒకసారి చురచుర చూసి మామగారితో అంది-

'మీరు చేసిన అన్యాయానికి త్వరలో ఫలితం అనుభవించబోతున్నారు. క్రిమినల్ కోర్టులో వియ్యంకుల సమావేశంకోసం ఎదురుచూస్తూ ఉండండి.'

'ఆఁ!'

'అవును. ఫోర్జరీనేరం బనాయించబోతున్నారు మీమీద.'

'ఫోర్జరీ!'

'అప్పుడే బెంబేలుపడకండి మరి. ప్రాసిక్యూషన్ కథనం యిది టూకీగా—కట్నం డబ్బు ఎగేశారనే కారణాన దశరథరామయ్య అనే ఒకాయన తన కోడలిద్వారా ఆమె తండ్రిగారి చెక్కుపుస్తకం దొంగిలింపించి దొంగసంతకం చేసి వసూలునిమిత్తం తనబ్యాంకర్లకు పంపాడు'

'హుఁ. కలికాలం. సాక్ష్యం!'

'నేనే. మూడురోజులక్రితం మీరు మాఊరికి వచ్చినట్టుగాకూడా సాక్ష్యం ఉంది.'

'నువ్వు ఆడదానివేనా! సిగ్గూ, బిడియం లేకుండా కోర్టుకెక్కుతావా?'

'నాకు అన్యాయంచేసిన రాక్షసులకి తగిన పాఠం చెప్పడానికి నేను ఏదీ లెక్క చెయ్యను. ఎలాగో నాజీవితాన్ని ధ్వంసంచేశారు. ఇక నేను భయపడవలసినది ఏదీలేదు, నన్నిస్థితికి తెచ్చిన మీనేరం ఎంతగొప్పదో ఆలోచించుకోండి.'

'ఛీ-నోరుముయ్యి.' కన్నెఱ్ఱచేశాడు జానకి మామగారు.

'మర్యాదగా మాట్లాడండి.' ఉద్రేకం ఆపుకోలేక జానకి మామగారు తటాలున కుర్చీనుంచి లేచి చేయెత్తాడు.

'నాన్నా!' జానకిభర్త కంఠం అరిచింది. శ్రీధరరావు ప్రయత్నం లేకుండానే. చేయి దింపాడు ముసలాయన, చేసేదేమీ లేక.

'మేజిస్ట్రేటుకోర్టులో బల్ల ఎక్కటానికి అంత ఆత్రుతగా ఉందా?' జానకి అపహాస్యం చేసే స్వరంతో అంది.

'అక్కా, బండి వచ్చింది.' జానకి చిన్న తమ్ముడు లోపలికి వెళ్ళి సూట్‌కేస్ పట్టుకు తయారయాడు.

'జానకీ.' హీనస్వరంతో అన్నాడు శ్రీధరరావు ప్రయత్నంమీద. తీక్ష్ణంగా శ్రీధరరావువైపు చూసింది జానకి. నిప్పులు చెరిగే ఆకళ్ళవైపు చూడలేక శ్రీధరరావు ఆకాశంవంక చూస్తూ అన్నాడు.

'ఎక్కడికి?' ... జవాబుచెప్పింది జానకి.

'ఇది ...దా?' సాహసించి అన్నాడు శ్రీధరరావు.

తెలుగు విశ్వవిద్యాలయము
గ్రంథాలయం
సంఖ్య ...
తేది ...

'కాదు.'

'నీకు చాలా అన్యాయం చేశాం జానకీ.'

'ఓహో! పశ్చాత్తాప పడుతున్నారా? పాపం! ఎందుకులెండి అంతక్రమ-అంతా మించి పోయింతర్వాత ఏమనుకుంటే ఏంలాభం-ఎలాగా ఛార్జీ తప్పదు.'

'ఆవిషయం నేను మాట్లాడదంలేదు. నీమనసు ఎంతబాధ పడ్డదో నేను గ్రహించక పోలేదు. చేసిన తప్పును దిద్దుకోవడానికి నువ్వు అవకాశం ఇవ్వాలి.'

'ఎందుకీ కల్లబొల్లి కబుర్లు. పద, బాబూ—'

'జానకీ, నామాట విను—ఇంట్లోకి పద.'

'నేను ఆట బొమ్మనని కాబోలు మీ అభిప్రాయం.'

'కాదు. అందుకే చెపుతున్నాను, ఇంట్లోకి పద-సావకాశంగా మాట్లాడదాం.'

'క్షమించండి. డబ్బు మనుష్యులతో నాకేమీ పని లేదు.'

'అందుకనే లోపలికి పదమన్నాను.' కొంచెం తీవ్రంగానే అన్నాడు. అధికారస్వరం వినగానే జానకికి ఒళ్లు మండింది.

'ఏమిటీ అధికారం!' సూటిగా ప్రశ్నించింది.

శ్రీధరరావు జానకి కళ్ళలోకి చూస్తూ అన్నాడు నిశ్చలంగా—

'జానకీ! నీమీద నాకా మాత్రం అధికారం లేదా!'

నిశ్చేష్టంగా జానకి శ్రీధరరావు ముఖంలోకి చూసింది.

'అక్కా, బండివాడు తొందరచేస్తున్నాడు' అని ఆమె తమ్ముడు చేయిపట్టుకు కదలించేదాకా జానకి ఈ ప్రపంచంలోకి రాలేదు. సజలనయనాలతో అంది.—

'బాబూ, పెట్టె లోపల పెట్టించు.'

ఆధ్యాత్మిక బోధనలా ఇప్పుడు కావలసింది?

యన్. యస్. నారాయణ

కొందరు పేర్కొనుచున్నట్లు ప్రస్తుతము మనదేశములో విపరీతముగా చెలామణిలో నున్న అవినీతి, నైతికపతనము ప్రజలకు ఆధ్యాత్మికజిజ్ఞాస తగ్గుటవలన సంభవించినవి కావు. వివిధరకములైన రాజకీయముల పరిజ్ఞానము ఏమాత్రములేని పూర్వకాలమున సైతము అప్పుడప్పుడు దేశములో ఇట్టి ఒడుదొడుకులు సంభవించియుండుట మనము ఎరిగియే యున్నాము. జనబాహుళ్యముతో నిత్యపరివర్తన చెందుచున్న ఆధునిక సమాజములో ఆందోళనకరమైన మార్పులు కలుగ వచ్చుననుట సరికాదు.

ఆధ్యాత్మికతత్వమును పాలుపోసి పెంచిన మన దేశచరిత్రను బ్రిటిషు దేశచరిత్రతో పోల్చి చూచినచో, చరిత్ర మనయెడల చూచిన చిన్న చూపు వ్యక్తముకాకమానదు. బ్రిటిషువారి చరిత్ర ప్రజలెప్పుడు నిరంకుశత్వమునకు వ్యతిరేకముగ పోరాడుట. వారు మనవలె కేవల ఆధ్యాత్మిక జీవులు గారు. ఈ లోకములో తమ బ్రతుకును చక్కని స్థితికి తీసుకొనిపోవు ప్రయత్నమే వారి నిత్యజీవితసమస్య. మనచరిత్ర చూడుడు. మహమ్మదీయులు ఈ దేశమునకు రాకపూర్వము దేశము అనేక స్వతంత్ర భాగములుగా చీలి, వాటిలో వాటికి ఐకమత్యములేక అశాంతికి నిలయమై యుండెడిది. మహమ్మదీయ యుగములో సైతము ఎపుడో ఒక అక్బరు వంటివాని పాలనమందు తప్ప ప్రజలు సౌఖ్యముగా బ్రదికినట్లు మన మెరుగము. బ్రిటిషువారి సవతితల్లి ప్రేమను వేరుగా చెప్పబూనుట సాహసము. వారి చల్లనిచూపు ప్రభావమును నేటికిని కొన్ని సమస్యలలో మనము చవిచూచుచునే యున్నాము. పైగా నాటిపాలకులలో సైతము ఈ జడత్వము దాపురించినది. మహమ్మదీయులు పెద్ద